నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | JANAGAON



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేత కేసీఆర్

- రేవంత్‌రెడ్డి పచ్చి రాజకీయ బ్రోకర్
- కార్యకర్తల కృషితోనే బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, ఫిబ్రవరి 10 : దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేతగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గడించారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని కుందూరు వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లోని 16 ఎంపీటీసీ స్థానాల పరిధి నేతలు, కార్యకర్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ దూరదృష్టితో దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా రైతు బంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా వంటి అద్భుత పథకాలకు శ్రీకారం చుట్టి పదేళ్లు విజయవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు 15 నెలల కాలంలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి రాజకీయ బ్రోకర్ అని, ఉదయం ఒక మాట, సాయంత్రం మరో మాట మాట్లాడతాడని, ఆయన సర్కారు రానున్న ఆరు నెలల కాలంలోనే కాలగర్భంలో కలసి పోతుందని జోస్యం చెప్పారు. ఎన్నికల తర్వాత పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు త్వరలోనే తీర్పు ఇవ్వడం ఖామయని, ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పక వస్తాయన్నారు. అంతేగాక ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డిపై 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఉన్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగితే భవిష్యత్తులో బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం చేకూరుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని ఎర్రబల్లి కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జులు పల్లా సుందర్‌రాంరెడ్డి, గుడిపూడి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామంలో నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు



చెన్నారావుపేట మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

# కాంగ్రెస్ సర్కారుపై కర్షకుల కన్నెర్ర

### రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

- నర్సంపేట నియోజకవర్గంలో రోడ్డెక్కిన అన్నదాతలు
- ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్
- లేదంటే ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరిక

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కర్షకులు కన్నెర్ర చేశారు.** రేవంత్ సర్కార్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసించారు. సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని 179 గ్రామాలకు చెందిన 20 వేలకు పైగా రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లకు చేరుకొని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పథకంలో ఎకరానికి రూ. 15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లు విక్రయించి రెండు నెలలైనా బోనస్ ఇవ్వలేదని, క్వింటాకు రూ. 500 చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

*- నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 10*



మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

## మిర్చితో మార్కెట్ కళకళ

- వరంగల్ ఎనుమాముల మార్కెట్ ఎరుపుమయం
- ఈ సీజన్‌లో అత్యధికంగా 50వేల బస్తాల రాక

కాశీబుగ్గ, ఫిబ్రవరి 10 : వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్ ఎరుపెక్కింది. మిర్చి యార్డుకు సోమవారం వేలాది బస్తాలు రావడంతో ఖరీదు వ్యాపారులు, అడ్తిదారులు, వివిధ కార్మిక వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఈ సీజన్ జనవరిలో మొదులు కాగా అత్యధికంగా సోమవారం 50వేల బస్తాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో మిర్చితో యార్డు నిండిపోయింది. కానీ ధరలు మాత్రం గతేడాదితో పోల్చితే ధరలు తక్కువ ఉన్నాయని రైతులు నిరాశ చెందుతున్నారు. ధరలు నచ్చని రైతులు మరుసటి రోజు అమ్ముకునేందుకు మార్కెట్‌లోనే నిల్వ చేసుకుంటున్నారు. సోమవారం తేజ మిర్చి 25,155 బస్తాలు రాగా ధరలు గరిష్ఠంగా రూ.13,400, మధ్యరకం రూ.12వేలు, కనిష్ఠంగా 10,500, వండర్‌హాట్ 1500 బస్తాలు రాగా అత్యధికంగా రూ.14,100, మధ్యరకం రూ.13వేలు, కనిష్ఠంగా రూ.11వేలు, యుఎస్-341 రకం మిర్చి 12వేల బస్తాలు రాగా అత్యధికంగా రూ.13,300, మధ్యరకం రూ.13వేలు, కనిష్ఠంగా రూ.11వేలు, దీపిక రకం మిర్చి 39 బస్తాలు రాగా గరిష్ఠంగా రూ.15,400, మధ్యరకం రూ.14వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, దేశీ రకం మిర్చి 3 బస్తాలు రాగా ధర రూ.15,012, 1048 రకం మిర్చి 867 బస్తాలు రాగా గరిష్ఠంగా రూ.12,500, మధ్యరకంగా రూ.11,500, కనిష్ఠంగా రూ.9వేలు, డీడీలు 97బస్తాలు రాగా గరిష్ఠంగా రూ.12,500, మధ్యరకం రూ.11వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, తాలు మిర్చి 32,24 బస్తాలు రాగా గరిష్ఠంగా రూ7వేలు, మధ్యరకంగా రూ.5,500, కనిష్ఠంగా రూ.3,500 పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.



నర్సంపేట : గురిజాలలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు



నెక్కొండ : అలంకానిపేటలో..

## సర్కారు హామీలన్నీ బోగస్


- కాంగ్రెస్ పాలనలో రైతులది భరోసాలేని బతుకు
- ఇచ్చిన హామీలు అమలు చేశాకే ఎన్నికలకు పోవాలే..
- లేదంటే కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

నల్లబెల్లి, ఫిబ్రవరి 10 : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని తేలిపోయిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. రేవంత్ సర్కారు పాలనలో రైతులది భరోసాలేని బతుకైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై నర్సంపేట నియోజకవర్గం వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా నల్లబెల్లి మండల కేంద్రంలో చేపట్టిన నిరసన ప్రాంతానికి పెద్ది తన నివాసం నుంచి కాడెడ్ల బండిలో వచ్చి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 179 గ్రామాల్లో 20 వేల పైచిలుకు రైతులు రోడ్లపైకి వచ్చి రేవంత్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ఇది ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ప్రధానంగా రుణమాఫీ, రైతు భరోసా, బోనస్, రైతు కూలీలకు సాయం పేరుతో మోసం చేసిందన్నారు. ఎన్నికల కోడ్ ఉందనే సాకుతో పథకాలను నిలిపి వేయాలని ఈసీ ఆదేశాలివ్వడం ప్రభుత్వ కుట్రలో భాగమేనన్నారు. అధికారంలోకి రాగానే రైతు భరోసా కింద ఎకరాకు ఏడాదికి రూ. 15 వేలు వేస్తామని మాట తప్పారని, ఇప్పుడు ఎకరానికి రూ. 6 వేలు రైతు ఖాతాల్లో జమవుతాయని, సెల్ ఫోనులకు టింగ్ టింగ్ మని మెస్సేజ్‌లు వస్తాయన్నారని, అవేమీ లేవన్నారు. అలాగే రైతు రుణమాఫీ 30 శాతం కూడా చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని నమ్మబలికి ఇప్పుడు సన్న ధాన్యానికే అంటూ మాట మార్చారన్నారు. ధాన్యం అమ్మి రెండు నెలలైనా ఇంతవరకు బోనస్ డబ్బులు వేయలేదన్నారు. నియోజకవర్గంలో రూ. 16.50 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాకే ఎన్నికలకు పోవాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి కర్రు కాల్చి వాతపెట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమవుతున్నారని పెద్ది హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ సర్పంచులు నానెబోయిన రాజారాం, మోహన్‌రెడ్డి, గందె శ్రీనివాస్‌గుప్తా, క్యాతం శ్రీనివాస్, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




నల్లబెల్లిలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- పొద్దున పొగమంచు.. మధ్యాహ్నం మండుటెండ !



దర్గా కాజీపేట రైల్వే వద్ద పొగ మంచు



శాయంపేట-మైలారం మధ్య లైట్లు వేసుకొని వెళుతున్న వాహనదారులు

*పొద్దున పొగమంచు కమ్ముకొని చలి చంపేస్తుంటే మధ్యాహ్నం అయ్యేసరికి ఎండ దంచికొడుతోంది. కొద్దిరోజులుగా ఇలా భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. సోమవారం పొద్దెక్కినా చలి ప్రభావం అలాగే ఉంది. చాలాచోట్ల 10గంటల వరకు సూరీడు బయటకు రాలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుంటూ నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది.*

*- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్/శాయంపేట*

## 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి ఎదురు గాలి
- స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు జంకుతున్న అధికార పార్టీ
- ఐదారు రోజుల్లో ఎలక్షన్ షెడ్యూల్ వచ్చే అవకాశం
- గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలి
- ముఖ్య కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపు



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 10 : అధికార కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలి వీస్తున్నదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందులో స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణరావు ముందున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొని గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగురవేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో భూపాలపల్లి, గణపురం మండలాల అధ్యక్షులు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, మోతె కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ కులగణన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ఎన్నికలకు వెళ్లేందుకు సర్కారు జంకుతున్నదన్నారు. గాలి మాటలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తుంటే ఆగమేఘాల మీద నాలుగు పథకాలకు దరఖాస్తులు తీసుకొని ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి వాటిని కాంట్రాక్టర్లకు ఇచ్చి కమీషన్లు తీసుకున్నాడని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి రైతులను మోసం చేసేందుకు రైతుల ఖాతాల్లో భరోసా డబ్బులు వేసినట్లే వేసి ఎన్నికల కోడ్ పేరుతో ఆపేశాడన్నారు. రైతులు కాంగ్రెస్ మోసాన్ని గ్రహించి ఓటు అనే బ్రహ్మాస్త్రంతో ఆ పార్టీకి వాతపెట్టాలని సూచించారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని ఇంటింటికి తీసుకెళ్తే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు పూర్తిస్థాయిలో బీఆర్‌ఎస్ గెలవడం ఖాయమన్నారు. మరో ఐదారు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని, కలిసికట్టుగా పనిచేసే పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడంతో పాటు నాయకులు, కార్యకర్తల సూచన మేరకు టికెట్లు ఇస్తామని, శ్రేణులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని గండ్ర హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కళ్లపు శోభ రఘుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, నాయకులు మందల విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్, రఘుపతి గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి, మండల అధ్యక్షురాలు మేకల రజిత, సులోచన, రెండు మండలాల్లోని మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో పీఆర్ ఏఈ

- ఇంటి నిర్మాణ అనుమతికి డబ్బులు డిమాండ్
- రూ. 10 వేలు తీసుకుంటూ పట్టుబడిన రమేశ్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏఈ రమేశ్, సహాయకుడు సారయ్య

సంగెం, ఫిబ్రవరి 10 : ఇంటి నిర్మాణ అనుమతి కోసం రూ. 10 వేలు లంచం తీసుకుంటున్న వరంగల్ జిల్లా సంగెం మండల పీఆర్ ఏఈ కంకాల రమేశ్‌ను సోమవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన హనుమకొండలో సుబేదారిలోని ప్రైవేట్ ఆఫీస్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల ప్రత్యేక అధికారిగా పీఆర్ ఏఈ రమేశ్ విధులు నిర్వర్తిస్తున్నాడు. మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన ఎనబోతుల మొగిలయ్య ఆయన భార్య సవిత పేరిట నిర్మించే ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. స్థలాన్ని పరిశీలించి అనుమతి ఇవ్వాల్సిన రమేశ్ ఆన్‌లైన్‌లోనే రిజెక్ట్ చేశాడు. దీంతో పలు పర్యాయాలు మొగిలయ్య రమేశ్ చుట్టూ తిరుగుతున్నప్పటికి అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో మొగిలియ్య వ్యక్తిగతంగా కలువగా రూ.10వేలు ఇస్తే అనుమతి ఇస్తానని రమేశ్ చెప్పాడు. విసిగిపోయిన మొగిలయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సుబేదారి ప్రాంతంలోని ప్రైవేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆఫీస్‌లో రమేశ్ సహాయకుడు గుగులోత్ సారయ్యకు రూ. 10 వేలు ఇవ్వగా, వాటిని ఏఈ రమేశ్‌కు అందజేశాడు. అక్కడే ఉన్న ఏసీబీ అధికారులతో రమేశ్‌తో పాటు సారయ్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కూడా పరిధిలోని గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే రెవెన్యూ, పీఆర్ ఏఈలు పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. మండలంలోని ఏ గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకున్నా అనుమతి కోసం రమేశ్ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలు ఆరోపణలున్నాయి. రమేశ్ ఏసీబీకి చిక్కడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కొనసాగుతున్న ఏరియల్ సర్వే

- నేటితో వర్ధన్నపేట మున్సిపాలిటీలో భూసర్వే పూర్తి
- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద



సెయింట్ గ్యాబ్రియల్ మైదానంలో డిజిటల్ ఏరియల్ సర్వే బృందంతో చర్చిస్తున్న కలెక్టర్ సత్యశారద

కాజీపేట, ఫిబ్రవరి 10 : కేంద్ర ప్రభుత్వం డిపార్టుమెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ద్వారా నక్ష పథకంలో భాగంగా ప్రణాళిక లేని పట్టణాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సర్వే చేస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద తెలిపారు. హెలికాప్టర్‌తో నిర్వహిస్తున్న డిజిటల్ ఏరియల్ భూసర్వే ప్రక్రియను కాజీపేట సెయింట్ గాబ్రియల్ మైదానంలో సోమవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వహణ తీరును సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏరియల్ ఫోటోగ్రఫీ, టెక్నాలజీ(2డీ)ను వినియోగిస్తూ సర్వే కొనసాగిస్తారని కలెక్టర్ చెప్పారు. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు, చెరువులు, కాల్వలు, రోడ్లు, హైటెన్షన్ విద్యుత్ వైర్లు అక్షాంశాలు, రేఖాంశాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల భూమికి నిజమైన యజమానులు ఎవరో గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రాథమిక సమాచార సేకరణే లక్ష్యంగా సర్వే కొనసాగుతుందన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో మొత్తం 41 కిలోమీటర్ల మేర సర్వే చేయాల్సి ఉన్నదని, మంగళవారంలోగా సర్వే పూర్తిచేస్తామని వారం తర్వాత చిత్రాలను అందచేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశా ల మేరకు కార్యాచరణ సిద్ధం చేసి అమలుచేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

## నస్తూరుపల్లి అడవిలో పెద్దపులి

- ప్రత్యక్షంగా చూసిన గ్రామస్తుడు
- పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు
- అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచన
- భయాందోళనలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



అధికారులు గుర్తించిన పెద్దపులి పాదముద్రలు

కాటారం, ఫిబ్రవరి 10 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సోమవారం పెద్దపులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి కొద్ది దూరంలోనే ఉన్న అటవీ (మహదేవపూర్ రేంజ్ పరిధి) ప్రాంతంలో పులి సంచరించిన పాద ముద్రలుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పశువుల మేత కోసం అడవిలోకి వెళ్లి వస్తున్న గ్రామానికి చెందిన వెంకటి అనే వ్యక్తి నస్తూరుపల్లి నుంచి మహదేవపూర్ వైపు వెళ్తున్న పెద్దపులిని చూసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగున గ్రామానికి చేరుకొని స్థానికులకు విషయం తెలుపగా వారు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. మహదేవపూర్ డిప్యూటీ రేంజర్ రాజేశ్వర్ తన సిబ్బందితో అడవిలోకి వెళ్లి పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. అయితే పెద్దపులి ఎటు వైపు వెళ్లిందో తెలియడం లేదని, నస్తూరుపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడవిలోకి వెళ్లకూడదని డిప్యూటీ రేంజర్ సూచించారు.